8,10 తేదీల్లో పీసా గ్రామసభలు

గిరిజనులను పీసా గ్రామసభలకు ఆహ్వానిస్తున్న నేతలు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మండలంలోని బస్కి పంచాయతీలో ఈనెల 8,10 తేదీల్లో సర్పంచ్ పాడి రమేష్ అధ్యక్షతన పీసా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పీసా కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం బస్కిలో మాజీ ఎంపిటిసి ఆధ్వర్యంలో ఈనెల 8న కొర్రగూడ, 10న గుగ్గుడు గ్రామాల్లో ఉదయం పది గంటలకు నిర్వహించే పీసా గ్రామసభ ఆహ్వానిస్తూ, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొర్రగూడ క్లస్టర్ పీసా కార్యదర్శి దేవన్న, ఉపాధ్యక్షులు రవికుమార్, కొండలరావు, రామరాజు, మొస్య పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పట్టవా ?

- గిరిజన ఆశ్రమాల్లో మరణాలను అరికట్టండి
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలువురు జెడ్‌పిటిసిలు
- పింఛన్ల మంజూరు, గృహ నిర్మాణాల వేగవంతానికి డిమాండ్

గిరిజన విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తున్న అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హాస్టల్ విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని, వారి ఇబ్బందులు పట్టకపోవడం శోచనీయమని పలువురు జెడ్‌పిటిసిలు అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మరణాలను అరికట్టాలని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు సహా ఏజెన్సీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుంచి 7 వరకూ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగాయి. తొలుత ఇటీవల అకాల మరణం పొందిన కొయ్యూరు జెడ్‌పిటిసి వారా సూకరాజుకు సభ్యులు సంతాపం తెలిపారు. తదుపరి 2వ స్థాయీ సమావేశం ప్రారంభమైంది. డిఆర్‌డిఎ, హౌసింగ్, సివిల్ సప్లైస్, విద్య, వైద్య ఆరోగ్య శాఖలపై చర్చ సాగింది. సుభద్ర మాట్లాడుతూ కొత్త పెన్షన్ల మంజూరు వివరాలను తెలపాలని కోరారు. గొలుగొండ జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లు మంజూరు చేసే విషయంలో విచారణ పేరుతో లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వితంతు పెన్షన్ల మంజూరులో జాప్యంపైనా ప్రశ్నించారు. అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలను అరికట్టాలన్నారు. ఇటీవల కాలంలో వరుస మరణాలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఒక్కో పాఠశాలలో 300 నుంచి 600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారి ఆరోగ్య రక్షణ కోసం నేటి వరకూ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంల నియామకాలు జరగలేదని తెలిపారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా? అని ప్రశ్నించారు. ఈ మరణాలు ప్రభుత్వ హత్యలేనని అన్నారు. బొర్రా ఆశ్రమ పాఠశాలలో నేటికీ విద్యార్థులు బురద నీరు తాగుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. డముకు ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, డొంకపుట్టు పాఠశాలకు అదనపు భవనం నిర్మించాలన్నారు. గిరిజన ప్రాంతంలో గృహాల మంజూరు, ఎల్‌పిసిలు, ఇళ్లకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వంటి అంశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ చర్యలతో ఇళ్ల నిర్మాణాల పట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపటం లేదన్నారు. దీనిపై అల్లూరి జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పందిస్తూ గతంలో ఇచ్చిన ఎల్‌పిసిలు చెల్లుతాయని, ఆర్‌డిఒ, తహశీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం గంగరాజు మరలా మాట్లాడుతూ గిరిజన మండలాలలో ఉచిత వంటగ్యాస్ పథకం, ఇకెవైసిపై అవగాహన కల్పించాలన్నారు. అవగాహన లేక అనేకమంది లబ్ధిదారులు నష్టపోతున్నారని తెలిపారు.

అరకు జెడ్‌పిటిసి శెట్టి రోహిణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పాఠశాలలకు ప్రహరీ గోడలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ తమ మండలంలోని కాకరాపల్లి గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్ హెడ్మాస్టర్ తప్పిదాలకు పాల్పడిన అంశంపై దర్యాప్తునకు వేసిన కమిటీ నివేదిక ఏమైందని ప్రశ్నించారు. దీనికి డిఇఒ బదులిస్తూ కమిటీ నివేదిక పూర్తయిందని, హెడ్మాస్టర్ తప్పు చేసినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. నర్సీపట్నం జెడ్‌పిటిసి సకల రమణమ్మ మాట్లాడుతూ వేములపూడి బాలికల వసతిగృహం కారుతోందన్నారు. కె.కోటపాడు జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం డబ్బులు పూర్తిస్థాయిలో లబ్ధిదారుల ఖాతాలో వేయలేదని తెలిపారు. మునగపాక జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకంపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారు. రోడ్ల అధ్వానం, ఆసుపత్రుల్లో కొరవడిన సౌకర్యాలు, ఇతర స్థానిక సమస్యలను పలువురు జెడ్‌పిటిసిలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి, మూడు జిల్లాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

విద్యార్థుల ఆరోగ్యం జాగ్రత్త : జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ వర్షాలు, శీతాకాలం కారణంగా విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారని, వారికి వేడి నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతుల్లో ఉన్న వాటర్ ప్యూరిఫ్లయర్లను వెంటనే బాగు చేయించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలను, ఎఎన్‌ఎంలను నియమించాలని అన్నారు.

రోజువారీ కూలి రేట్లు పెంచాలి

- చింతపల్లి, పాడేరుల్లో కాఫీ కార్మికుల సమ్మె

సిఐటియు ఆధ్వర్యాన చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న కాఫీ కార్మికులు

ప్రజాశక్తి - చింతపల్లి: ఎపిఎఫ్‌డిసి సంస్థను పరిరక్షించుకుంటూనే, తమ సమస్యల పరిష్కారానికి సమ్మెను కొనసాగిస్తామని కాఫీ కార్మికులు స్పష్టం చేశారు. తమ వేతనాల పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని 20రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ, యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ముందుగా ప్రకటించిన విధంగానే గురువారం నుంచి సమ్మె బాటపట్టారు. చింతపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా కాఫీ డివిజనల్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి, అక్కడ రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, విడిఎ పాయింట్లకు అనుగుణంగా కాఫీ పండ్ల సేకరణ రేటు, రోజువారీ కూలీ పెంచాలని కోరారు, కార్మికుల క్వార్టర్స్ మరమ్మతులు చేయడం లేదని, ఇఎస్‌ఐ, పిఎఫ్‌లను పక్కపెట్టారని,350 మంది సిబ్బంది ఉన్నచోట 18మంది ఎపిసిలు 17 హెల్పర్లతోనే సంస్థను నడిపిస్తున్నారని, ఐదుగురు డివిజన్ మేనేజర్లు అవసరమైతే ముగ్గురే పనిచేస్తున్నారన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ముందుగానే సమ్మె నోటీసు ఇచ్చినా, యాజమాన్యం నిర్లక్ష్యం వీడలేదని, కార్మికులను చర్చలకు పిలిచి, సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి. సత్యనారాయణ, కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర రాజు, మాజీ అధ్యక్షులు ఎన్. కనకవల్లి, మోరి వెంకటగిరి, రాజారావు, వెంకటేశ్, కించ బాబూరావు, కోన నాగేష్, కె. బాలకృష్ణ, బలరాం పాల్గొన్నారు.

పాడేరు: కూలి రేట్లు పెంచాలని కాఫీ కార్మికులు డిమాండ్ చేశారు. ముందుగా ప్రకటించిన విధంగానే గురువారం నుంచి పాడేరు, చింతపల్లిలో సమ్మెబాటపట్టారు. మండలంలోని మినుములూరు ఎపిఎఫ్‌డిసి కాఫీ ఎస్టేట్ కార్మికులు విధులను బహిష్కరించి, రీజినల్ మేనేజర్ కార్యాలయానికి తరలివచ్చి బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను డివిజనల్ మేనేజర్‌కు ఏకరువు పెట్టి,వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం (సిఐటియు) గౌరవాధ్యక్షుడు ఎల్ సుందర్రావు మాట్లాడుతూ రెగ్యులర్, రోజువారీ, సీజనల్ కాఫీ కార్మికులకు రోజువారీ కూలి రేట్లు పెంచాలని కోరారు. కాఫీ పండ్ల సేకరణ రేట్లు పెంచాలని, ఎపిసిలుగా ఉన్న వాళ్లందర్నీ ప్లాంటేషన్ కండక్టర్లుగా గుర్తించాలని, గ్రామాల నుంచి రోజూ పనులకు వచ్చే కార్మికులకు పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో హెల్పర్స్ కె.కాంతమ్మ, సుందర్ కుమార్, రామారావు, వసంత, కన్నాత్, వరలక్ష్మి, దేవి, చిన్నాలమ్మ, ఎర్రమ్మ పాల్గొన్నారు.

పాడేరులో డివిజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాఫీ కార్మికులు

ముగ్గురు ఆశ్రమ విద్యార్థినులకు మలేరియా

- జీనబాడు బాలికల పాఠశాలలో కలకలం

మలేరియాతో ఆసుపత్రిలో చేరిన విద్యార్థులు

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని మారుమూల జీనబాడు బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలలో మలేరియా మహమ్మారి విజృంభిస్తోంది. ముగ్గురు విద్యార్థినులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, వారికి వైద్యపరీక్షలు నిర్వహించగా మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. వారికి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి జిల్లా దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కె.కోటపాడు సిహెచ్‌సికి రిఫర్ చేశారు. దీంతో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో 108 అంబులెన్స్‌లో హుటాహుటిన కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల నిర్వాహకులు నిర్లక్ష్యం వీడాలని, తక్షణమే తగు చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా సిపిఎం నేతలు డి. వెంకన్న, కె. గోవిందరావు డిమాండ్ చేశారు. మిగిలిన విద్యార్థులకూ మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఇబ్బందులపై అధికారులు స్పందించాలన్నారు.

శిక్షణా శిబిరాన్ని సందర్శించిన సెన్సస్ అధికారి నివాస్, కలెక్టర్ దినేష్‌కుమార్

గృహ గణన శిక్షణా తరగతుల పరిశీలన

ప్రజాశక్తి-జీకే.వీధి : మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో గృహ గణనపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ జె.నివాస్, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. 2027లో సెన్సస్ చేయడానికి కోసం సెన్సెస్ ఆఫ్ ఇండియా నాలుగు చార్జెస్ చేయడం జరిగిందని తెలిపారు. జీకే వీధిలో ఒక చార్జిగా పరిగణిస్తూ దేశంలోనే ఇదొక సుధీర ప్రాంతంగా పరిగణిస్తూ ఈ లోతట్టు ప్రాంతంలో డిజిటల్ సెన్సెస్ ద్వారా సర్వే చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మొదటిగా నవంబర్ 10 నుండి 30 వరకు బ్లాక్ లెవెల్‌లో ఎనుమరేషన్ చేయడం జరుగుతుందని, కావున స్థానిక తహసిల్దార్, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు సెన్సస్ ప్లానింగ్‌ను వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి తిరుమణి పూజ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి ప్రసన్నకుమార్, డిప్యూటీ డైరెక్టర్ చంద్రకళ, రీసెర్చ్ ఆఫీసర్ మ్యాప్ సెక్షన్ రమాదేవి, డిపిఎ సిహెచ్ వెంకటరమణ, ఎస్ఐ గ్రేడ్-2 ఎం.రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ల తనిఖీ

ప్రజాశక్తి-ఎటపాక : మండల పరిధిలోని గుండాల ఇసుక స్టాక్ పాయింట్లు 1, 2లను జిల్లా మైనింగ్ అధికారి ఆనంద్ గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటపాక మండలంలో ఏర్పాటు చేసిన రెండు స్టాక్ పాయింట్లను విహారి ఏజెన్సీ లోడర్‌కు అప్పజెప్పడం జరిగిందని, ఈ స్టాక్ పాయింట్ల వద్ద ప్రభుత్వ అనుమతులతో వాహనాలకు ఇసుక సరఫరా చేయబడుతుందని తెలిపారు. ముందస్తు బిల్లులు తీసుకొని ఇసుక సరఫరా చేసుకోవచ్చని చెప్పారు. ఎటువంటి అనుమతులు, బిల్లులు లేని వాహనాలను ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద రానివద్దని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎటపాక మండలానికి కూతవేటు దూరంలో తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ఉండడంతో ఆంధ్ర ఆధార్ కార్డులతో ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి తీసుకు వెళుతున్న వాహనాలను గుర్తించి ఆ వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లో ఇసుక నింపరాదని, సచివాలయ సిబ్బందికి, రెవెన్యూ అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. ఇసుక రవాణా చేసే వాహనాలు ఇసుక లోడింగ్ అనంతరం టార్పలిన్లు కప్పుకొని వెళ్లాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ఎటపాక మండల తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో నాగమణి, పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న మైనింగ్ అధికారి ఆనంద్

టూరిజం ద్వారా గిరిజనుల అభివృద్ధి

ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీ ప్రాంత గిరిజనులు టూరిజం శాఖ ద్వారా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. మారేడుమిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ మారేడుమిల్లి అడవి ప్రాంతం అయినందున టూరిజం పరంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కడైనా రెండు మూడు గదుల గృహాలు ఉన్నవారు హోమ్ స్టే ఏర్పాటు చేసేకొనే వారికి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. హోమ్ స్టే ఏర్పాటు చేసేకొనేవారు తప్పనిసరిగా గ్రామ సచివాలయాలలో గాని, ఎంపీడీవో కార్యాలయంలోగాని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వారికి ఇళ్లలో వాడుతున్న కరెంట్ బిల్లుల మాదిరిగానే ప్రతి నెల కరెంట్ బిల్లు వస్తుందని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా కూడా హోమ్ స్టే ఏర్పాటు చేసుకున్న వారికి వెలుగు ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. హోమ్ స్టే నిమిత్తం ఇప్పటివరకు 59 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. డిఎస్‌పి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అడవి ఎక్కువనందున మైదాన ప్రాంతాల నుండి ఎక్కువగా పర్యాటకులు వస్తారని, వారు హోమ్ స్టేలో ఉండటానికి ఎక్కువగా ఇష్టపడతారని తెలిపారు. హోమ్ స్టేలు ఏర్పాట్లు బినామీలు లేకుండా ఈ ప్రాంత గిరిజనులకు మాత్రమే అనుమతించాలని గిరిజనులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత, జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ ఎల్ రవికుమార్, టూరిజం శాఖ నోడల్ అధికారి ప్రసన్న లక్ష్మి, జిల్లా టూరిజం అధికారి దాసు, తహసిల్దార్ పి.బాలాజీ, ఎంపీడీవో కిషోర్ కుమార్, మేనేజర్ రాజ్యలక్ష్మి, ఈఈ రవికుమార్, డిఈ చైతన్య, సర్పంచ్ పి వెంకటరమణ, ఏపీఎం దుర్గాప్రసాద్, ఉపాధి హామీ ఏపీవో మణి కుమారి, కూటమి నాయకులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాలు, గిరిజన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులకు హోమ్ స్టేలు కేటాయించాలి

మారేడుమిల్లి : మండలంలోని గిరిజన ప్రాంతంలో నిర్వహిస్తున్న అర్హులైన స్థానిక గిరిజన నిరుద్యోగ యువతకు హోమ్ స్టేలను కేటాయించాలని మండలంలోని సర్పంచులు, ప్రజా ప్రతినిధులు గురువారం ఎంపీడీవో రవి కిషోర్‌కి వినతి పత్రం అందజేశారు. మండలంలో 12 పంచాయతీలు, 71 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, అనేకమంది ఆదివాసీ యువతీ, యువకులు చదువుకొని ఉపాధి లేక వలసబాట పడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ హోమ్ స్టే ద్వారా గిరిజన యువతకు ఉపాధి చేకూరాలని ఉద్దేశంతో పేపర్ ప్రకటన ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కానీ ఇక్కడ కొంతమంది స్వలాభంతో చట్లవాడ, చావడికోట, పుల్లంగి, మారేడుమిల్లి గ్రామపంచాయతీల అనర్హులైన వారికి హోమ్ స్టేలను కేటాయించడం జరిగిందని తెలిపారు. పంచాయతీ సర్పంచులకు తెలియకుండా గోప్యంగా ఈ సర్వే చేశారని, వెంటనే వాటిని రద్దు చేసి పంచాయతీ సర్పంచుల ఆధ్వర్యంలో అర్హులైన వారికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజకుమార్ రెడ్డి పల్లాల, సర్పంచులు వి జార్జి బాబు, ఎస్ రమాదేవి, ఎస్ ప్రేమ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏ మంగిరెడ్డి, కె.వి.రమణారెడ్డి, పి రామిరెడ్డి, ఎం సూర్య ప్రకాశ్ రెడ్డి, కే సన్యాసిరెడ్డి, ఎం రామన్నదొం పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

మారేడుమిల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గురువారం గిరినోద్యమ నాయకులు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గిరిజనులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో గిరిజన హక్కులు, భూములపై హక్కుల కోసం బిర్సా ముండా ఎంతగానో కృషి చేశారని తెలిపారు. పీఎం జన్మన్, ఆది కర్మయోగి, జూగా కార్యక్రమాల ద్వారా మారుమూల గ్రామాలలో గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఇళ్లు లేని నిరుపేద గిరిజనులకు సర్వే చేసి గృహాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విభూతి బ్రదర్స్ వారిచే బుర్ర కథ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత, జడ్పిటిసి గొర్లె బాలాజీబాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, తహసిల్దార్ పి.బాలాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఎంపీడీవో కిషోర్ కుమార్, కూటమి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, డీఈలు చైతన్య, పి.వెంకటరమణ, వెలుగు ఏపీయం దుర్గాప్రసాద్, మహిళా సంఘాలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

రంపచోడవరాన్ని తూర్పు గోదావరిలో కలపొద్దు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలిపే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాజవొమ్మంగిలో జి.లోవప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమాఖ్య నాయకులు గంపా నాగరాజు, తాము సూరిబాబు, వంతు బాలకృష్ణ, గుమ్మిడి లోవరాజు మాట్లాడూతూ ఇప్పటికే ఏజెన్సీలో గిరిజనులు పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని తెలిపారు. జిఒ 3 ప్రకారం ఈ ప్రాంత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు 100 శాతం గిరిజనులకు చెందవలసి ఉండగా ప్రభుత్వం కుట్రపూరితంగా ఆదివాసీల రిజర్వేషన్లను తారుమారు చేసి గిరిజనలకు మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో విలీనం చేసే ప్రక్రియ జరుతుందని, తక్షణం ఈ ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని, రంపచోడవరాన్ని ఏజెన్సీ జిల్లాగానే కొనసాగించాలని కోరారు. లేకుంటే గిరిజన ప్రజానీకాన్ని ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకిరి గంగరాజు, పామి మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పాడేరు ఐటిడిఎ పిఒ శ్రీపూజ

గురుకులంలో ఐటిడిఎ పిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం సాయంత్రం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వసతి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం భోజనం అందించడంలో లోపాలు ఉన్నట్లు గుర్తించి డిప్యూటీ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయని గుర్తించిన పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ ప్రాక్టికల్స్ చేయించడం లేదని, ఆధునిక విద్యను అందించాల్సిన చోట ఈ నిర్లక్ష్యం సరికాదని హెచ్చరించారు. ఇకపై ఇలాంటి లోపాలు జరగకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను పిఒ దృష్టికి ప్రిన్సిపల్ తీసుకువచ్చారు.

ఎకో సెన్సిటివ్ జోన్‌లను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : నేషనల్ పార్క్ ఎకో-సెన్సిటివ్ జోన్‌లను వ్యతిరేకించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు, ఆదివాసీ హక్కులు-ఉద్యోగాల సాధన కమిటీ గౌరవ అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సోకుల గూడెం, ధార గూడెం, సీమ గండి గ్రామలలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సెన్సిటివ్ జోన్‌గా ఈ ప్రాంతాన్ని ప్రకటించడమంటే ఆదివాసీలకు అడవి మీద హక్కు లేకుండా చేయడమేనని, వెంటనే ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలని పిలుపునిచ్చారు. పోలవరం మాదిరి నిర్వాసితులుగా మార్చొద్దన్నారు. గ్రామ సభల్లో తీర్మానం చేయడం కోసం, అనుమతి కోసం ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సంతకాలు పెట్టకపోతే మీకు అభివృద్ధి ఉండదని, ఎటువంటి పథకాలు ఉండవని ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు బెదిరించి బలవంతంగా సంతకాలు సేకరించడానికి ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనుల మీద దాడి చేసే ఉద్దేశ్యంతో ఫారెస్ట్ అధికారులు మాట్లాతున్నారని, ఇది సమంజసం కాదని హితవుపలికారు. తక్షణమే ఏకో సెన్సిటివ్ జోన్‌లుగా ప్రకటించాడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు అడవి మీద హక్కు లేకుండా చేసే కుట్ర తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వం తీరు మారకుంటే గిరిజనులను సమీకరించి పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రంపచోడవరం మండల అధ్యక్షులు సాదల విద్యాసాగర్ రెడ్డి, సోకుల గూడెం, దారగూడెం, సీమ గండి గ్రామ పెద్దలు కడబాల వెంకటేశ్వర్లు, కడబాల పండమ్మ, అన్నిక చిన్నయ్య, కడబాల బాబురావు, వలల రామరావు, కడబాల సరస్వతి, సుంట్రూ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సిరి మల్లిరెడ్డి

బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ ప్రారంభంతో..

ప్రకృతి వ్యవసాయానికి కొత్త శకం

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేసే దిశగా జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ గురువారం కొత్త చర్యలకు నాంది పలికారు. పాడేరు మండలం డోకులూరు గ్రామాన్ని సందర్శించి రైతులలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. మొదటగా రైతు కృష్ణారావు స్థాపించిన బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ప్రకతి వ్యవసాయానికి అవసరమైన బయో ఇన్‌పుట్ల తయారీ, వాటి వినియోగం, గడువు తేదీల వంటి అంశాలను రైతు కృష్ణారావుతో కలెక్టర్ స్వయంగా చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు కృష్ణారాఉ కృషిని కలెక్టర్ ప్రశంసించారు.. అనంతరం ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దేశీ విత్తనాల ప్రదర్శనను కలెక్టర్ సందర్శించారు. ఈ ప్రదర్శనలో 65కిపైగా దేశీయ విత్తన రకాలు ప్రదర్శించారు, కలెక్టర్ వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. స్థానిక విత్తనాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించి, రైతులు సంప్రదాయ విత్తనాల వినియోగం పెంచాలని సూచించారు. కొత్తగా నియమితులైన ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌లతో సమావేశమయ్యారు. శిక్షణా విధానాలు, ప్రాక్టికల్ మోడల్స్ గురించి అడిగి తెలుసుకుని, ప్రకృతి వ్యవసాయ విస్తరణలో వారి పాత్ర కీలకమని వారిని ప్రోత్సహించారు.గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ సూత్రాలను పాటించాలని సూచించారు. అనంతరం దేశీయవరి వంగడాలు, ఎటిఎం, ఏ గ్రేడ్ మోడల్స్, అలాగే 60కిపైగా పంటలతో ఉన్న బయో డైవర్సిటీ ప్లాట్‌ను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి పంటల వైవిధ్యం, నేల ఆరోగ్యం, బయో ఇన్‌పుట్ల వినియోగంపై సూచనలు అందజేశారు. చివరలో కలెక్టరను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.బాబూరావు నాయుడు, డిపిఎం లాలం భాస్కరరావు సత్కరించారు.

బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రిన్సిపాల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహం ప్రారంభించాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. గురువారం ప్రిన్సిపాల్ పి చలపతిరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మారుమూల ప్రాంతం నుండి పేద విద్యార్థులు కళాశాలలో చేరి చదువు కుంటున్నారన్నారు. అయితే వసతి సౌకర్యం లేకపోవడంతో కొందరు అద్దెకు ఇళ్లనుతీసుకుని, అందులో ఉండి చదువుతుండగా, మరికొందరు నిత్యం ఇంటి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రెండు విధానాలు పేద విద్యార్థులకు వ్యయప్రయాసలతోపాటు వారికి పూర్తి భద్రత లేని పరిస్థితి ఉందని ఎస్ఎఫ్ఐ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారు చదువుపై పూర్తి ఏకాగ్రత, దృష్టి పెట్టే అవకాశం ఉండదన్నారు. ఈ నేపథ్యంలో మహిళ డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ మండల అధ్యక్షులు టి ప్రేమ్ సాగర్,కార్యదర్శి ఎస్ ఐసుబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా నేత పి రామన్న,డిగ్రీ కళాశాల చైర్మన్ ఎస్ఎఫ్ఐ నేతలు జి అనుష్క,ఎస్ మంజుల, వి వసంత, టి.పూర్ణమ్మ, వి దేవకీ,వి అంకిత పాల్గొన్నారు.

చెలమల నీరే గతి

పాడైన పైపులైన్‌తో తాగునీటికి ఇక్కట్లు
మామిడివలసలో దాహం కేకలు

గుంత నుండి నీటిని సేకరిస్తున్న మహిళ

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి మామిడివలస గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామానికి చెందిన 15 కుటుంబాలు దాహార్తితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతపేట నుంచి మామిడివలసకు ఏర్పాటు చేసిన పైపులైన్, ఇటీవల మొంథా తుపాన్ ప్రభావంతో మధ్యలో మరమ్మతుకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో, గ్రామ మహిళలు గత్యంతరం లేని పరిస్థితుల్లో గెడ్డ సమీపంలో చెలమను తవ్వి, అందులో ఊరిన నీటిని సేకరించి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలోని చెలమల్లో సేకరించిన . కలుషితమైన నీటిని తాగడం వలన రోగాల బారిన పడతామేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, పాడైన పైపులైన్ బాగుచేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని వేడుకంటున్నారు. తక్షణం స్పందించకుంటే ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని మోదమాంబ కాలనీ, సిపిఎం కాలనీ, నీలిగెడ్డవీధి, తదితర ప్రాంతాల్లో తాగునీరు సదుపాయం లేక నాలుగేళ్లుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సురక్షితమైన తాగునీరు సదుపాయం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు అనేకసార్లు మండల, పంచాయతీ అధికారులకు విన్నవించడంతోపాటు ఐటిడిఎ పిఒకు రాతపూర్వకంగా విన్నవించినప్పటికీ నేటికీ సమస్యల పరిష్కారం కాలేదని స్థానికులు ఆవదేన వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి కృష్ణారావు, వార్డు సభ్యురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ, తాగునీటి కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా, గిరిజన గ్రామాల్లో దాహం కేకలు వినిపించడం దారుణమని, నిధులు మంజూరు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణాలోపం, నిర్వాకంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని మండిపడ్డారు. దీనిపై ఈనెల 7న శుక్రవారం మరోమారు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని, అప్పటికే స్పందించకుంటే ఆందోళన తీవ్రం చేయకతప్పదని హెచ్చరించారు కార్యక్రమంలో శాఖ కార్యదర్శి డి.కృష్ణమూర్తి, నాయకులు పి.లింగమూర్తి, వార్డు సభ్యురాలు అన్నపూర్ణ, రావణమ్మ, లక్ష్మీ, నీలమ్మ పాల్గొన్నారు.

పిఎం జన్‌మన్, పిఎంఎవై సమస్యలపై 10న ధర్నా

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : పిఎం జన్‌మన్, పిఎంఎవై లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10న సోమవారం మండలకేంద్రంలో తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు పిలుపునిచ్చారు .మంగళవారం మండలంలోని బాబూశాల పంచాయతీ బల్లుగూడ, మొండిగుమ్మ గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, కార్యదర్శి కె నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాథ్ పర్యటించారు. ఈ పర్యటనలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ పిఎం జన్‌మన్ గ్రామీణ గృహ లబ్ధిదారుల బిల్లు బకాయిలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ. లక్ష అదనపు ఆర్థికసాయం వెంటనే చెల్లించి, పిఎంఎవై ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ, పిఎంజన్‌మన్, పిఎంఎవైలో ఇళ్లు మంజూరయ్యాయన్న ఆనందంలో ఉన్న ఇళ్లను తొలగించి నిర్మాణాలకు పూనుకున్న లబ్ధిదారులు, ప్రభుత్వం, అధికారుల నిర్వాకంతో ఉన్న ఇళ్లకు కోల్పోయి షెడ్‌లలో జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ పిఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలతోపాటు రోడ్లు, తాగునీరు,విద్యుత్ తదితర సౌకర్యాలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆర్.దేవన్న హౌసింగ్ లబ్ధిదారులు గ్రామస్తులు కె చిరంజీవి, కామేశ్వరరావు, జి నరేష్,బాలన్న పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

గాలి కాలుష్యంతో ఊపిరితిత్తుల కేన్సర్

ప్రజాశక్తి - ఆరిలోవ : పొగత్రాగేవారిలో మాత్రమే కాకుండా గాలి, పర్యావరణ కాలుష్యానికి గురయ్యే వారు కూడా ఊపిరితిత్తుల కేన్సర్ బారిన పడే అవకాశముందని మెడికవర్ హాస్పిటల్స్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రమావత్ దేవ్ తెలిపారు. ఊపిరితిత్తుల కేన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకొని గురువారం అవగాహన ప్రకటన విడుదల చేశారు. 70 శాతం కంటే ఎక్కువ కేసులు మూడవ దశ లేదా అంతకంటే ముందరి దశలోనే గుర్తించగలుగుతున్నట్లు వివరించారు. ఈ వ్యాధిని తొలి దశలో గుర్తించడం అత్యంత కీలమని పేర్కొన్నారు. లోడోస్ సిటీ స్కాన్లు, నిరంతం శ్వాశ సమస్యలను సమయానికి పరిశీలించడం వల్ల ముందస్తు నిర్ధారణ సాధ్యమవుతుందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

125 కిలోల గంజాయి స్వాధీనం
- అంతర్ల వద్ద నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి- చింతపల్లి: మండలంలోని అంతర్ల వద్ద గురువారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. చింతపల్లి సిఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. అంతర్ల వద్ద పోలీసులు వాహన తనిఖీల చేస్తుండగా, అటుగా వచ్చిన ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో ప్యాకింగ్‌చేసి తరలిస్తున్న 125 కిలోల గంజాయి పట్టుబడిందని సిఐ వినోద్‌బాబు తెలిపారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు సిఐ తెలిపారు.

మాట్లాడుతున్న సిపిఎం నేతలు

దబ్బలపాడు సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని మారుమూల నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ దబ్బలపాడు కొండ శిఖరు గ్రామంలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిపిఎం వార్డు మెంబర్ సోమ్మెల. అప్పలరాజు. పార్టీ మండల కార్యకర్త కొనపర్తి సింహాచలం డిమాండ్ చేశారు. ఎత్తైన కొండలు దట్టమైన అటవీ ప్రాంతంలో పది కుటుంబాల గిరిజనులు తాతముత్తాతల నుంచి జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి రహదారి, తాగునీరు,విద్యుత్, ఇతర కనీస సౌకర్యాలు నేటికీ కల్పించలేదన్నారు. కొన్నేళ్లుగా తమ సమస్యలను పరిష్కరించాలని దబ్బలపాడు గిరిజనులు మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కు లేదని, కూటమి ప్రభుత్వమైనా వారి కష్టాలను తీర్చాలని కోరారు.అత్యవసర, నిత్యవసరాలకు దబ్బలపాడు నుంచి అటు విజయనగరం, ఇటు మండలంలోని ముఖ్యగ్రామాలకు వెళ్లక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అనారోగ్య సమస్యలు, ప్రనవ కష్టాలు ఉత్పన్నతమైతే డోలిమోతలే శరణ్యమని, విజయనగరం జిల్లా మెంటాడకు మోసుకెళ్లక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, దబ్బలపాడు గిరిజనుల సమస్యలను పరిష్కరించి, కనీస సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ జంబువలస జంక్షన్ నుండి వేంగ్డ, డముకు వరకు అధ్వానంగా ఉన్న రహదారికి స్థానిక గిరిజనులే స్వచ్ఛందంగా మరమ్మతులు చేపట్టారు. అప్పటికే అంతంతమాత్రంగా ఉన్న ఈ రహదారి, ఇటీవల మొంథా తుపాన్ దెబ్బకు మరీ అధ్వానంగా మారిందని, రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.దీని మరమ్మతులకు అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం, రాకపోకలకు రానురాను ఇబ్బందులు తీవ్రం కావడంతో గిరిజనులంతా సమిష్టిగా ముందుకొచ్చారు. తలోకొంత విరాళాలను వేసుకుని, సిమెంట్, ఇసుక గ్రామ ప్రజలే స్వయంగా గురువారం రహదారి మరమ్మతులు చేపట్టారు. అధికారులు వచ్చి, ఏదో చేస్తారని ఎదురుచూసేకన్నా, ప్రస్తుతం రాకపోకలకు ఏమాత్రం యోగ్యంగా లేని రోడ్డును ప్రజల విరాళాలతో, వారి స్వచ్ఛంద భాగస్వామ్యం, శ్రమదానంతో బాగుచేసుకుంటున్నామని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి, తాము తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన రోడ్డుకు శాశ్వతప్రాతిపదికన పటిష్టం చేయాలని దబ్బలపాడు వాసులు వేడుకుంటున్నారు.

రోడ్డు మరమ్మతులు చేస్తున్న గిరిజనులు

వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

వాహనదారులు రికార్డులు కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు అన్నారు. గురువారం జడ్డంగి గ్రామ శివారున ఎస్ఐ చినబాబు వాహన తనిఖీలు చేపట్టారు. జడ్డంగి రాజవొమ్మంగి ప్రధాన రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనం ఆపి రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనదారుల నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ. ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు అన్ని సక్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ సత్యాగ్రహ యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ఈనెల 9వ తేదీ నుండి విఆర్ పురం మండలం కొటారి కొమ్ము గ్రామం నుండి ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర ప్రారంభమవుతుందని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ తెలిపారు. స్థానిక రేఖపల్లిలో వెటకాని మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనిల్ మాట్లాడుతూ అరకు సభ సాక్షిగా కూటమి ప్రభుత్వం రాగానే జీవో నెంబర్‌ని పునరుద్ధరిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

స్థానిక నిరుద్యోగులతోనే టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీలో ప్లైన్ ఏరియా నుంచి వచ్చిన గిరిజనేతర టీచర్లను తిరిగి ప్లైన్ ఏరియాకి పంపించాలని కోరారు. సేవా సంఘం జిల్లా నాయకులు చిక్కల బాలకృష్ణ మాట్లాడుతూ పోలవరం, రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్‌లను కలిపి స్వచ్ఛమైన ఏజెన్సీ జిల్లాగా ప్రకటించాలని, అది వీలు కాకపోతే అల్లూరి జిల్లాలోనే ఈ ప్రాంతాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, జేఏసీ డివిజన్ ఉపాధ్యక్షులు ఉయిక రాంప్రసాద్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పాయం లక్ష్మణరావు, కొండా రెడ్ల సంఘం నాయకులు మూర్ల కనకరెడ్డి, నాయకులు బేతి ముత్తయ్య, సోడే భానుప్రసాద్, మూర్ల మహేష్ రెడ్డి, పొగల అప్పలరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మంప పంచాయతీలో సుమారు రూ.25 లక్షలతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను జెఇ సాయికృష్ణ గురువారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు.

ఎపి జెన్‌కో అధికారులను కలిసిన జమాల్ ఖాన్

ప్రజాశక్తి-మోతుగూడెం : జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతూరు మండల టిడిపి అధ్యక్షులు మహమ్మద్ జమాల్ ఖాన్ గురువారం ఎపి జెన్‌కో లోయర్ సీలేరు ప్రాజెక్ట్ ముఖ్య ఇంజనీర్ రాజారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై విన్నవించడం జరిగింది. ఏపీ జెన్కోలో పనిచేస్తున్న గుత్తేదారు కార్మికులకు అద్దె ప్రాతిపాదికన నివాస గృహాలు కేటాయించాలని, ఐదు ఆరు యూనిట్లు కన్స్ట్రక్షన్‌లో భాగంగా లోకల్‌గా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ముఖ్య ఇంజనీర్ వాటిని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జమాల్ ఖాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ వరప్రసాద్ పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ లేదని కేంద్రం ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం లేదని కేంద్రం డిసెంబర్ 31లోగా ప్రకటించాలని, అలా కాని పక్షంలో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించడంలో విఫలమైన సిఎం చంద్రబాబు తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నేపథ్యంలో ఉక్కు కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. కోట్ల రూపాయల లాభాల్లో ఉన్న గూగుల్‌కు విశాఖలో డేటా సెంటర్ కోసం 22 వేల కోట్ల ప్రజాధనాన్ని రాయితీల రూపంలో ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐదు వేలలోపు ఉద్యోగాలు వస్తాయో లేదోగానీ, దానికి 500 ఎకరాల భూములు, పెద్ద మొత్తంలో రాయితీలు ఇవ్వడం దారుణమన్నారు. ఉత్తుత్తి ఊకదంపుడు ఉపన్యాసాలు ఆపాలని కూటమి నేతలకు హితవు పలికారు. రైతుల పరిస్థితి ఎపిలో దారుణంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోటీశ్వరులకు రుణాలు మాఫీ చేస్తున్నాయని, పేదల కష్టాలను పట్టించుకోవడం లేదని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైకి ఓ న్యాయవాది చెప్పు విసిరిన ఘటన నేటి న్యాయవ్యవస్థ పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. పత్రికా స్వేచ్ఛ కరువైందన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరు ఘోరంగా ఉందన్నారు.

అంధకారంలో కెజిహెచ్

సాయంత్రం నుంచి నిలిచిన విద్యుత్ సరఫరా
రోగులకు తీవ్ర అవస్థలు

సెల్ టార్చ్ వెలుగులోనే మహిళకు చికిత్స అందిస్తున్న నర్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కెజిహెచ్‌లో గురువారం సాయంత్రం నుంచి అంధకారం అలుముకుంది. ఆసుపత్రిలోని చాలా విభాగాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్త్రీల వార్డులో పరిస్థితి దయనీయంగా మారింది. జనరేటర్లు అక్కడక్కడా పనిచేసినా చికిత్సలు ముందుకు సాగలేదు. సెల్‌ఫోన్ టార్చ్ వెలుగుల్లోనే నర్సులు సేవలు అందించారు. ఉక్కబోతతో రోగులు పడ్డ బాధలు వర్ణనాతీతం. అధికారులు, ప్రభుత్వం నుంచి ప్రత్యామ్నాయ చర్యలు కొరవడ్డాయి. ఈ ఏడాది ఆగస్టులోనూ ఇటువంటి పరిస్థితే ఎదురైంది. ఆసుపత్రి సిఎస్ఆర్ బ్లాక్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ ఘటన నుంచైనా అధికారులు పాఠాలు నేర్వలేదు.

గంజాయిపై ప్రజలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గంజాయి వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన అవసరమని స్థానిక ఎస్ఐ శివకుమార్ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడీ టీచర్లు, హెల్పర్‌లకు గంజాయిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ కుమార్ మాట్లాడుతూ గంజాయిని సేవించేవారు, క్రయ విక్రయాలు చేసేవారు, పండించే వారు ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజాయి స్మోక్ చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ సుజాత, సూపర్వైజర్లు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధారకొండ మండల కేంద్రం సాధన కమిటీ విరాళాల సేకరణ

ప్రజాశక్తి-సీలేరు : దారకొండ కేంద్రంగా మండల కేంద్రం ఏర్పాటు చేయాలని ఉద్యమానికి గురువారం విరాళాలు సేకరణ చేపడుతున్నామని మండల సాదన కమిటీ నాయకులు సుంకర విష్ణుమూర్తి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు, ఏ.దారకొండ పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలు విరివిగా విరాళాలు అందజేసి మండల కేంద్రం ఏర్పాటుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గురువారం దారకొండ కాలనీవాసులు రూ.3.300 విరాళం అందించినట్లు తెలిపారు. మండల కేంద్రం సాధించుకుంటే పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుందని, లేకుంటే పంచాయతీ పరిధి గ్రామాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సందంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్లి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుప్పిలివాడ మాజీ సర్పంచ్ అల్లంకి రాజు పాల్గొన్నారు.

నేటి నుండి పాడేరు-భద్రాచలం బస్సు పునరుద్ధరణ

ప్రజాశక్తి-సీలేరు : పాడేరు డిపోకు చెందిన పాడేరు వయా చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌ను ఈనెల 7వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు పాడేరు డిపో మేనేజర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బస్సు సమయం కూడా మార్పులు చేర్పులు చేయడం జరిగిందని పేర్కొన్నారు. 7 తేదీ శుక్రవారం పాడేరు డిపోలో మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి భద్రాచలం రాత్రి 11 గంటలకు చేరుతుందని, మరసటి రోజు ఉదయం 7 గంటలకు భద్రాచలంలో బయలుదేరి పాడేరు సాయంత్రం ఐదు గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు సర్వీస్‌కు ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.

కాలువలో చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

మంపలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మంప పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య పనులు పంచాయతీ కార్యదర్శి ఎల్.రవి ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం బడి'

ప్రజాశక్తి-జీకే.వీధి : మండలంలోని పెదవలస పంచాయతీ పరిధి డోకులూరు, బంధవీధి గ్రామాల్లో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తుఫాను తర్వాత వరి పంటలో వచ్చే చీడపీడల నివారణపై పలు సూచినలు చేశారు. వరి తరవాత పొలాలు ఖాళీగా ఉండకుండా మొక్కజొన్న, కొమ్ముశెనగ, పప్పు దినుసు పంటలు వేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.గిరిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగ శంకర్, గిరిజన వికాస్ సభ్యులు సత్యనారాయణ, బాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి-సీలేరు : రాష్ట్రంలో ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్‌లను తిరిగి తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని ప్రతిపాదించినట్లు మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖలు స్పష్టత నిచ్చాయని తెలిపారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో కొన్ని మండలాలకు జిల్లా కేంద్రమైన పాడేరు దూరం కావడమే కాకుండా, గతంలో ప్రతిపక్ష నాయకుడుగా చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ముంపు మండలాలతో పాటు రంపచోడవరం డివిజన్ పరిధిలో గల మండలాలను కలిపి రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

ఇటువంటి సమయంలో ప్రభుత్వం చింతూరు, రంపచోడవరం డివిజన్‌లను తిరిగి తూర్పు గోదావరి జిల్లాలో కలపాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో యధావిధిగా అల్లూరి జిల్లాలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసమే జిల్లాల పునర్విభజన జరిగితే షెడ్యూల్డ్ ప్రాంత పరిపాలనను దృష్టిలో పెట్టుకోవాలని, షెడ్యూల్డ్ ప్రాంతాన్ని నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంలో కలిపితే ఆదివాసీల హక్కులు, చట్టాలు పూర్తిగా ఉల్లంఘించబడతాయని పేర్కొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక శివాలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యాన ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎంపిటిసి చప్పా చంద్రరాణి, కనిగిరి గంగదుర్గాలు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి వెంకటలక్ష్మి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 లక్షలతో రెండు బిట్లలో రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు ముప్పన కేశవ, చీలపల్లి అప్పారావు, ఎంపిటిసి లక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివ, జనసేన నాయకులు జి.సాయి తదితరులు పాల్గొన్నారు.